

బాధితుడికి ఫోన్‌ను ఇస్తున్న సీఐ కిషన్

## పోయిన సెల్‌ఫోన్ అప్పగింత

పరకాల, జూన్ 19: పోయిన సెల్‌ఫోన్‌ను పోలీసులు దొరకపట్టి బాధితుడికి అప్పగించారు. పరకాల పట్టణానికి చెందిన సాంబరాజు రాజు ఇటీవల తన సెల్‌ను ఓ ఫంక్షన్‌లో పోగొట్టుకున్నాడు. ఈ విషయంపై మీసేవ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా పోయిన ఫోన్‌ను దొరకపట్టి బాధితుడికి అప్పగించినట్లు సీఐ పుల్యాల కిషన్ తెలిపారు.

## డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 18 మంది మాల్‌ప్రాక్టీస్

హనుమకొండ చౌరస్తా, జూన్ 19: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలో సోమవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 18మంది మాల్‌ప్రాక్టీస్ కింద బుక్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఎ.నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నుంచి 11మంది, మర్రిపెడ ఆర్‌జేఆర్‌ఎం డిగ్రీ కాలేజీ, తొర్రూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, తొర్రూర్ సమతా డిగ్రీ కాలేజీ, ఖమ్మం ప్రియదర్శిని డిగ్రీ కాలేజీ, చెర్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఒక్కరి చొప్పున, భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఇద్దరు ఉన్నట్లు వివరంచారు.

# ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

### నగదు, బైక్, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ టీమ్

కాజీపేట, జూన్ 19: పట్టణంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీస్‌లు సోమవారం అరెస్ట్ చేసి, నగదు, పేకముక్కలు, బైక్, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐలు శ్రీనివాస్‌రావు, జనార్ధన్‌రెడ్డి కథనం ప్రకారం.. కాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిద్ధార్థనగర్‌లో అమర్‌నాథ్‌రెడ్డి ఇంట్లో కొందరు పేకాట ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్‌ఏసీపీ జితేందర్‌రెడ్డికి సమాచారం వచ్చింది. ఏసీపీ ఆదేశానుసారం టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.16వేల 970 నగదు, 5స్మార్ట్ సెల్‌ఫోన్లు, మోటర్ సైకిల్, స్కోర్‌బుక్, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దాడిలో నగరానికి చెందిన దేవ మధు, ప్రశాంత్‌నగర్‌కు చెందిన బొల్లెడ రాజేశ్వర్‌రెడ్డి, ఎక్సైజ్ కాలనీకి చెందిన ఏనుగేల నిరంజన్‌రెడ్డి, వెంకటేశ్వరకాలనీకి చెందిన ఉపాధ్యాయుడు దండపాటి ప్రభాకర్‌రెడ్డి, కాజీపేట కూరగాయల మార్కెట్‌కు చెందిన పాశి శ్రీకాంత్ పట్టుబడినట్లు వివరించారు. వీరిని కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. సీఐలు శ్రీనివాసరావు, జనార్ధన్‌రెడ్డి, ఎస్సైలు లవణ్‌కుమార్, శరత్, రాజు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, పేకముక్కలను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

## వాటర్ బాటిల్ త్వరగా ఇవ్వాలన్నందుకు..

### యువకుడిపై వైన్స్‌షాప్ యజమానుల దాడి

సుబేదారి, జూన్ 19: మద్యం కొనేందుకు వచ్చిన యువకుడిపై వైన్స్‌షాప్ యజమానులు దాడి చేసిన సంఘటన హనుమకొండ హంటరోడ్డులో ఆదివారం జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. హనుమకొండ శ్రీనగర్‌కాలనీకి చెందిన పెరికేటి సాకేత్, మిత్ర కలిసి ఆదివారం హంటర్‌రోడ్డులోని వెంకటేశ్వర వైన్స్ షాప్ వద్దకు వచ్చి మద్యం బాటిల్ కొనుగోలు చేశారు. వాటర్ బాటిల్ కూడా కొనగా ఇవ్వడంలో ఆలస్యం కాగా ప్రశ్నించినందుకు వైన్స్‌షాప్ లోని యాజమానులు ఇద్దరు దూషిస్తూ కర్రలతో దాడిచేశారు. దీంతో సాకేత్ తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆపేందుకు ప్రయత్నించిన స్నేహితులపై కూడా దాడి చేశారు. వారిని స్నేహితులు ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. ఈమేరకు సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి బాధితుడు సుబేదారి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సీసీ కెమెరాల ద్వారా విచారణ చేస్తున్నామని సీఐ షుకూర్ తెలిపారు.



దాడిలో గాయపడిన యువకుడు

## నేత్రదాతల తల్లికి సన్మానం

హసన్‌పర్తి, జూన్ 19: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరి కళ్లను దానం చేసేందుకు అంగీకరించిన తల్లిని తెలంగాణ నేత్రశరీర అవయదాతల సంఘం వరంగల్ ఆధ్వర్యంలో సన్మానించారు. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన అన్నా చెల్లె పోరెడ్డి సుమిత్‌రెడ్డి, పూజితారెడ్డి ఈనెల9న రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా వారి కళ్ల దానానికి తల్లి అంగీకరించారు. నాగారంలో సోమవారం సంస్కరణ సభ నిర్వహించగా ఆమెను సన్మానించి, అభినందన పత్రాన్ని అందజేశారు. ఇద్దరు అంధులకు చూపునివ్వనున్నట్లు వారు అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొంరెడ్డి మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పెళ్లి ఉపేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కరేటీ శంకర్‌రావు, లయన్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ సాయిరెడ్డి, గౌరు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



నేత్రదాతల తల్లి సుజాతకు అభినందన పత్రాన్ని అందజేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

## 11 మంది వాహనదారులకు ఫైన్

పోచమ్మమైదాన్, జూన్ 19: వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 11 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి సోమవారం రూ.12,500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ బాబులాల్ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 10 మందికి రూ.19,600 జరిమానా విధించారని పేర్కొన్నారు.

## కేజీబీవీల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గిర్మాజీపేట, జూన్ 19: జిల్లాలోని అర్బన్ రెసిడెన్షియల్ కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న 23 పీజీ సీఆర్టీ, 2- సీఆర్టీ పోస్టులకు తాత్కాలిక పద్ధతిలో పని చేయడానికి అర్హత, ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో డీ వాసంతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 5లోగా https://schooledu. telangana. gov. in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో సూచించారు. దరఖాస్తుదారులకు రాత పరీక్ష ఆన్‌లైన్‌లో అబ్జెక్టివ్ పద్ధతిలో నిర్వహిచనున్నట్లు డీఈవో తెలిపారు.

## చైర్‌పర్సన్, కమిషనర్‌కు ఉత్తమ అవార్డులు

నర్సంపేట, జూన్19: దశాబ్ది ఉత్సవాల్లో నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజినీ కిషన్, కమిషనర్ వెంకటస్వామి ఉత్తమ అవార్డులు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో హరితోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నర్సంపేట మున్సిపాలిటీలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న హరితోత్సవంలో ముందుంటున్నది. నర్సంపేట మున్సిపాలిటీకి అవార్డు రావడానికి సహకరించిన రాష్ట్ర హరిత మిత్ర అవార్డు గ్రహీత పెద్ది సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్‌అశ్విని వాకడే తానాజీ, జిల్లా ఫారెస్టు శాఖ అధికారులు పాలక వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లాస్థాయి టీఎల్‌ఎం మేళా ప్రారంభం

కరీమాబాద్, జూన్ 19 : ఈ నెల 20న విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపకరణాల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు పాఠశాలల నుంచి దాదాపు 105 ఎగ్జిబిట్లను విద్యార్థులు ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి మాలోత్ సారయ్య, హెచ్‌ఎంలు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో బయటపడిన వర్గ విభేదాలు

పోచమ్మమైదాన్, జూన్ 19: వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో మరోసారి కాంగ్రెస్ విభేదాలు బయటపడ్డాయి. రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను మూడు వర్గాలుగా విడిపోయి నిర్వహించారు. పోచమ్మమైదాన్ సెంటర్‌లో కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు వేర్వేరుగా వేడుకలు జరుపుకున్నారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో పాటు, కొండా వర్గం నాయకులు తమ తమ మద్దతుదార్లతో జన్మదిన వేడుకల జరుపుకున్నారు. ఈ రెండు వర్గాలే కాకుండా కొత్తవాడ బరుపటి రవిరాజ్ వర్గం కూడా సెంటర్‌లో వేడుకలు జరిపారు. కొంతమంది సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఎటు వెళ్లాలంటూ విస్తుపోతున్నారు.

## వికాస తరంగిణి ఆధ్వర్యంలో యోగా

వరంగల్ చౌరస్తా, జూన్ 19: వికాస తరంగిణి ఆధ్వర్యంలో జూన్ 21 నుంచి హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు వికాస తరంగిణి ప్రతినిధులు తెలిపారు. సోమవారం సాయంత్రం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వికాస తరంగిణి హనుమకొండ, వరంగల్ పట్టణ విభాగం ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు చాడ సుభాష్‌రెడ్డి, పారాల దయాకర్‌రెడ్డి వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ప్రభుత్వ చీఫ్ దాస్యం వినయ్‌భాస్కర్, సీపీ రంగనాథ్ హాజరు కానున్నట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మండల కోఆప్షన్ సభ్యుడి మృతి

వర్ధన్నపేట, జూన్ 19: రోడ్డు ప్రమాదంలో మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ పాషా సోమవారం మృతిచెందాడు. మండలంలోని ఇల్లందకు చెందిన ఆయన మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడిగా రెండేళ్లుగా కొనసాగుతున్నారు. సోమవారం ఉదయం వరంగల్‌కు తన బైక్‌పై వెళ్లి తిరిగి వస్తున్నాడు. మామునూరు ఏపీఎస్పీ పెట్రోల్ బంకులో బైక్‌లో పెట్రోల్ పోయించుకొని రోడ్డు దాటుతుండగా జాతీయ రహదారిపై లారీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కాగా స్థానికులు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. కుమారుడు సహీమ్‌పాషా మండల కోఆప్షన్ సభ్యుడిగా ఉన్న సమయంలో అనారోగ్యంతో మృతిచెందగా పాషాకు అదే పదవిని ఎమ్మెల్యే అవకాశం కల్పించారు. ఇతడు కూడా అదే పదవి ఉండి చనిపోయారు. కాగా, మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే అరూరి రమేశ్ పరామర్శించారు. వరంగల్ ఎంజీఎం దవాఖానకు వెళ్లి పాషా మృతదేహాన్ని పరిశీలించారు. రోడ్డు ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. పాషా తెలంగాణ ఉద్యమ సమయం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ కోసం క్రమశిక్షణ గల కార్యకర్తగా పనిచేశాడని తెలిపారు. ఎంపీపీ అప్పారావు, ఇల్లంద సర్పంచ్ సాంబయ్య, ఎంపీటీసీ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి ఉన్నారు.



పాషా(ఫైల్)



పాషా మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమేశ్

## 108లో ప్రసవం.. తల్లీ బిడ్డ క్షేమం

కమలాపూర్, జూన్ 19: ఆస్పత్రికి తరలిస్తుండగా 108 వాహనంలో సిబ్బంది ప్రసవం చేశారు. మండలంలోని గోపాల్‌పూర్‌కు చెందిన ఇంగ్లే సంధ్య డెలీవరీ కోసం కమలాపూర్ ప్రభుత్వాస్పత్రికి వచ్చింది. పురిటినొప్పులతో బాధపడుతుండగా కరీంనగర్ జిల్లా హుజురాబాద్ సివిల్ ఆస్పత్రికి 108వాహనంలో తరలించారు. హుజురాబాద్‌కు తరలిస్తుండగా ఉప్పల్ రైల్వేగేట్ సమీపంలో పురిటినొప్పులు ఎక్కువ కావడంతో డాక్టర్ శ్రీకాంత్ సూచనతో 108సిబ్బంది ఉపేందర్, సందీప్ డెలీవరీ చేశారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉండటంతో కమలాపూర్ ఆస్పత్రికి తరలించారు. సాధారణ కాన్పు చేసిన 108 సిబ్బందిని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడిగా దీకొండ భిక్షపతి

హసన్‌పర్తి, జూన్ 19: హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన దీకొండ భిక్షపతిని హనుమకొండ జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం, కుల సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



దీకొండ భిక్షపతి

## ఆటో, కారు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

నర్సంపేట రూరల్, జూన్ 19: కారు ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని ఆకులతండా జీపీ పరిధిలోని ఇప్పల్‌తండాలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఇప్పల్‌తండా నుంచి ఓ ఆటో ప్రయాణికులతో నర్సంపేటకు బయల్దేరింది. కారు నర్సంపేట నుంచి మల్లంపల్లికి వెళ్తూ మార్గమధ్యలో ఇప్పల్‌తండా శివారు క్రాస్‌రోడ్డు వద్ద ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడి అందులోని ఇటుకాలపల్లికి చెందిన విద్యుత్ హెల్పర్ కొంకటి నగేష్‌తో పాటు ఇప్పల్‌తండాకు చెందిన దారావత్ మోహన్ తల, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని అంబులెన్స్‌లో పట్టణంలోని జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

## వేర్వేరు చోట్ల బైక్‌లు చోరీ

గిర్మాజీపేట, జూన్ 19: రెండు వేర్వేరుచోట్ల బైక్‌ల చోరీ కాగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ సీఐ డీ మల్లేశ్ కథనం ప్రకారం.. పోచమ్మమైదాన్‌కు చెందిన పండ్ల వ్యాపారి ఎండీ ఇస్మాయిల్ ఆదివారం దేశాయిపేటలోని సురేశ్‌బార్ ముందు ప్యాషన్ ప్లస్ బైక్ చోరీకి గురైంది. ఖిలావరంగల్‌కు చెందిన న్యాల శివ ఈనెల 9న రాత్రి కాశిబుగ్గ లక్ష్మీ వైన్స్ ఎదుట నిలిపిన గ్లామర్ బైక్ కనిపించలేదన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## అమెరికా సదస్సుకు ఎస్సార్ వర్సిటీ ఫ్యాకల్టీ శ్రీశైలం

హసన్‌పర్తి, జూన్ 19: అమెరికాలో ఈనెల 19న జరిగిన సదస్సుకు అనంతసాగర్‌లోని ఎస్సార్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ డాక్టర్ శ్రీశైలం ఇంటర్నేషనల్ సింపోసియం ఆన్ మాలిక్యూలర్ స్పెక్ట్రోస్కోపీ (ఐఎస్‌ఎంఎస్) 2023 అమెరికా వేదికపై తన పరిశోధనలు ఫలితాలను ప్రదర్శించడానికి శనివారం బయల్దేరి వెళ్లినట్లు యూనివర్సిటీ చాన్స్‌లర్ ఏ.వరదారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాలిక్యూలర్ స్ట్రక్చర్, వైబ్రేషనల్ క్యారెక్టరిక్స్, యాంటీ క్యాన్సర్ యాక్టివిటీ ఆఫ్ ఎటిరోసైక్లిక్ థయేసెమీ కార్బన్‌జోన్స్ పైన పరిశోధనలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. చాన్స్‌లర్ ఏ.మధుకర్, వీసీ దీపక్‌గార్గ్, రిజిస్ట్రార్ అర్చనరెడ్డి, డీన్ మహేశ్, ప్రొఫెసర్లు వెంకట్‌రాంరెడ్డి, రమణారావు శుభాకాంక్షలు తెలిపారు.